నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25

TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...

విజయవాడ | తేదీ : 24-31 మార్చి 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 42 | పేజీలు : 4 | రూ. 5.00

నవచైతన్యానికి నాంది - ఉగాది

'యుగాది' అంటే యుగానికి ఆది (మొదలు) కాస్తా, ఉగాది అయింది. ఒకప్పుడు యుగం అనేదాన్నే కాలానికి పరిమితిగా భావించే వారట! అందుకే, వైశాఖ శుద్ధ తృతీయ నాడు కృతయుగం, కార్తీక శుద్ధ నవిమి నాడు త్రేతాయుగం, భాద్రపద బహుళ త్రయోదశిన ద్వాపరయుగం, మాఘ బహుళ అమావాస్య రోజు కలియుగం మొదలైనట్లు మన ప్రాచీనులు పేర్కొన్నారు. మరింతకీ ఈ యుగాలు ఎలా ఏర్పడుతున్నాయి. వాటిని ఎలా నిర్ణయిస్తున్నారు అని మరో సందేహం వస్తుంది. సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి (గురువు) గ్రహాలకు కొన్ని నక్షత్రాలతో నిర్ణీత సంబంధం కలిగినప్పుడు ఈ యుగాలు ఏర్పడతాయి. మరో మాటలో చెప్పాలంటే యుగాదులు వస్తున్నట్లు పురాణ ప్రమాణాలు చెబుతున్నాయి. కాన్నీ, కాలక్రమంలో కొత్త సంవత్సరం ప్రారంభిమవడాన్ని ఉగాదిగా అభివర్ణించడం అలవాటులోకి వచ్చింది.

చైత్ర మాసారంభమే ఉగాది! .ఉగాదినే మన ప్రాంతాల్లో నేడు సంవత్స రాదిగా పాటిస్తున్నారు. చాంద్రమానం ప్రకారం ప్రతి చైత్ర శుద్ధ పాడ్యమితో కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. 'ఋతూనాం కుసుమాకర:' అని వసంత చైత్రమాసంతోనే ప్రారంభం అవుతుంది. ఈ వసంతకాలంలోనే ప్రకృతిలో నవచైతన్యం మొదలువుతుంది. ఉత్తరాయణ పుణ్యకలాన్ని కూడా చైత్రమాసం నుంచే లెక్కిస్తారు. వీటన్నిటిని బట్టి చైత్ర మాసమే ఉగాది (యుగానికి ఆది) అనీ, అదే సంవత్సరాదిని పెద్దలు తీర్మానించారు.

శాస్త్రజ్ఞుల తీర్మానం.. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే సూర్యుడు భూమధ్యరేఖపై ఉదయిస్తారు. అంటే, భారతదేశానికి సంబంధించిన లంకలో ఆ రోజే సూర్యోదయం అవుతుంది. కాబట్టి, చైత్ర శుద్ధ పాడ్యమినే ఉగాదిగా, సంవత్సరాదిగా భాస్కరాచార్యుల వారు నిర్ధారించారు. సృష్టి ఆదిలో సూర్యోదయం ఈ చైత్రశుద్ధ పాడ్యమి నాడే జరిగి ఉండవచ్చని ప్రమాణాలతో సహా హేమాద్రి నిరూపించారు. ఆ రోజునే పండుగగా ప్రకటించి, పండుగ జరుపుకొనే విధానాన్ని కూడా తెలియపరచారు.

ఉగాది విశేషాలు... ఈ చైత్రశుద్ధ పాడ్యమిన సంవత్సరాదిగా, ఉగాదిగా పండుగను చేసుకొనే విధానం ఏమిటో తెలుసుకుందాం. ఈ సంవత్సరాది నాడు ప్రాత:కాలాన్నే అభ్యంగన స్నానం చేసి, భగవంతునికి పూజలు చేసి, పెద్దల ఆశీస్సులను పొంది నూతన వస్త్రాలు ధరించాలి. ఆనాడు ఆహారాన్ని తీసుకొనే ముందు ఉగాది పచ్చడిని భగవంతునికి నివేదన పెట్టాలి. దానిని గొజ్జు అని కూడా కొన్ని చోట్ల అంటారు. దానిలో ముఖ్యంగా వేపపూత, ఉప్పు, గసగసాలు, పచ్చిమిరప కాయ, మామిడి ముక్కలు, బెల్లం మొదలైన వాటిని కలిపి, ఉగాది పచ్చడిని తయారు చేస్తారు. షడ్రసోపేతమైన ఈ పచ్చడిలొ వివిధ పదార్థాల రుచులు, మానవ జీవితంలో నిత్యం ఎదురయ్యే సుఖదు:ఖాది సంఘటనలకు ప్రతీకలు. దీనిలో నేతిని కూడా కొంచెం వేస్తారు. ఈ నేతిబొట్టు లాగానే సంసారయాత్ర నిర్వహిస్తున్నాము. దానిలో ఎదురయ్యే సమస్యలకు అతీతుడవై నిర్లప్తంగా మనస్సు ఉంచుకోవాలి అని భావం. అంతా చివరకు శుభప్రదం కావాలని ఈ ఉగాది పచ్చడిని తినడంలోని అంతర్నిహిత భావన.

ఉగాది పర్వదినాన పంచాంగ శ్రవణం చేయడం పరిపాటి. తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణములనే అయిదింటితో కూడినది పంచాంగం. పంచాంగంలో చెప్పే ఫలితాలను గమనించి, మానవుడు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నది పంచాంగ శ్రవణంలోని ఉద్దేశంగా కనిపిస్తుంది.

తెలుగువారి తొలి పండుగైన శ్రీరామనవమికి, ఈ సంవత్సరాది నుండే అంకురార్పణ జరుగుతుంది. వర్షాలు బాగా కురవాలని ఇంద్రుణ్ణి పూజించడం కూడా కొన్ని చోట్ల జరుగుతుంది. దీనికి భగవతంలో ప్రమాణం కూడా ఉంది. ఈ ఇంద్రోత్సవంలో తనను పూజించబోమని చెప్పిన దేవదేవుడైన శ్రీకృష్ణుని మాటలకు ఆగ్రహిసంచి, ఇంద్రుడు పెద్ద వర్షాన్ని కురిపించగా శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలితో పెకెత్తి గోపాలురను కాపాడతాడు. ఆ శ్రీకృష్ణ పరమాత్మ మనందరికీ ఈ నూతన ప్లవ నామ సంవత్సరంలో సకల శుభాలూ చేకూర్చుగాక...!

30న ఉగాది రోజు పి-4 విధానం ప్రారంభం-పటిష్ట ఏర్పాట్లు

-ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఈనెల 30వ తేది ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర సచివాలయం వెనుక పి-4 విధానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర స్థాయిలో లాంచనంగా ప్రారంభించనున్నారని అందుకు తగిన పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు.ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయం నుండి ఆయన జిల్లా కలక్టర్లు,సంబంధిత శాఖల అధికారులతో వీడియో సమావేశం ద్వారా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు.పి-4 (ప్రభుత్వ,ప్రవేట్,ప్రజల, భాగస్వామ్యం)తో సమాజంలోని పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఈకార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని తెలిపారు. ముఖ్యంగా సమాజంలో ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను దత్తత తీసుకుని వారికి అండగా నిలిచి పేదరికం నుండి పైకి తీసుకురావాలనే ఆశయంతో పి-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు.ఇప్పటికే ఈ పీ4 విధానంపై ప్రభుత్వం ప్రజల నుంచి సూచనలు,సలహాలు స్వీకరించడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న పి-4 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఉగాది పర్వదినం నాడు అమరావతి వేదికగా నిలవనుందన్నారు.30వ తేదీ సాయంత్రం 5గం.ల నుండి రాత్రి 7గం.ల వరకూ ఈకార్యక్రమం జరగనుందన్నారు.ఈకార్యక్రమానికి వచ్చే వారందరినీ ఆదివారం మధ్యాహ్నం 3గం.ల లోపు వేదిక వద్దకు తీసుకురావాల్సి ఉందని ఆదిశగా అందరు జిల్లా కలక్టర్లు తగిన తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఇప్పటికే ఇందుకు సంబంధించి అమరావతి ప్రధాన వేదిక వద్ద ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుండి స్వయం సహాయక సంఘాలు,విద్యార్థులు,రైతులు,ఉపాధి కూలీలను ఆహ్వానించి ప్రత్యేక బస్సులు ద్వారా వారిని అమరావతి పి-4 ప్రారంభోత్సవ వేదిక వద్దకు తీసుకురావాల్సి ఉంటుందని సిఎస్ చెప్పారు.సుమారు 11వేల 500 మందిని వారిలో సుమారు 3వేల మంది మహిళలు ఉండేలా ఈకార్యక్రమానికి తీసుకు రావాల్సి ఉందని తెలారు.అమరావతి సమీప జిల్లాలైన ఏలూరు,కృష్ణా,ఎన్టిఆర్,గుంటూరు జిల్లాల నుండి సుమారు 7వేల మందిని,పల్నాడు,తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి కనీసం 500 మంది వంతున ఈకార్యక్రమానికి తీసుకు రావాలన్నారు.అదే మిగతా జిల్లాల నుండి 300 మంది వంతున,దూర ప్రాంత జిల్లాలైన మన్యం,అల్లూరి సీతారామరాజు,చిత్తూరు,అన్నమయ్య,కర్నూల్,అనంతపురం,శ్రీ సత్యసాయి జిల్లాల నుండి 50 మంది వంతున తీసుకురావాలని చెప్పారు.ఇందుకు అవసరమైన ఆర్టీసు బస్సులను ఆయా జిల్లాల నుండి అందుబాటులో ఉంచడం జరుగు తుందని పేర్కొన్నారు. బస్సులు ద్వారా కార్యక్రమానికి తీసుకువచ్చే వారిని సురక్షితంగా తరలించి సురక్షితంగా వారి గమ్య స్థానాలకు తిరిగి చేర్చేందుకు వీలుగా ట్రాఫిక్,భద్రత తదితర అంశాలపై జిల్లా కలక్టర్లు, ఎస్పిలు తగిన ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.ప్రజలను తరలించే ప్రక్రియను రాష్ట్ర స్థాయి నుండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రాష్ట్ర స్థాయిలో స్టాంప్స్ అండి రిజిస్ట్రేషన్ శాఖ ఐజి హరినారాయణను మరో ముగ్గురు ఉన్నతాధికారులను నియమించడం జరిగిందని ప్రతి జిల్లాకు ఒక నోడలు అధికారిని,ప్రతి బస్సుకు ఒక లైజన్ అధికారిని నియమించాలని సిఎస్ కలక్టర్లకు చెప్పారు. గతంలో బహిరంగ సభలకు తరలించినట్టు రొటీన్ విధానంలో కాకుండా ఒక ప్రత్యేక ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న ఈకార్యక్రమానికి ఆయా వర్గాల ప్రజలను తీసుకురావాలని అంతేగాక ఉగాది పర్వదినాన్ని కోల్పోతున్నామనే భావన వారిలో కలగకుండా ఉండే రీతిలో తగిన వసతులు కల్పించి తీసుకురావాలని స్పష్టం చేశారు.అమరావతికి సమీప జిల్లాల నుండి తరలించే వారిని అదే రోజు ఉదయం బయలు దేరే విధంగా చూసుకుని వారికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం,రాత్రి భోజన ఏర్పాట్లు,దూర ప్రాంత జిల్లాలకు చెందిన వారు ఒక రోజు ముందే బయలుదేరాల్సి ఉన్నందున రెండు రోజులకు తగిన వసతి ఏర్పాట్లు చేయాలని సిఎస్ విజయానంద్ స్పష్టం చేశారు.

ఈసమావేశంలో రాష్ట్ర స్టాంప్స్ అండి రిజిస్ట్రేషన్ల శాఖ ఐజి హరినారాయణ,ప్రణాళికా శాఖ సంయుక్త కార్యదర్శి అనంత శంకర్ పాల్గొనగా వర్చువల్ గా ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్ కుమార్,ఆర్టీసి ఎండి ద్వారకా తిరుమల రావు,సియం కార్యదర్శి ప్రద్యుమ్న,అన్ని జిల్లాల కలక్టర్లు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదిలేలోపే పునరావాసం పూర్తి

-పోలవరం నిర్వాసితులతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి చంద్రబాబు



పోలవరం, నేటి పత్రిక ప్రజావార్త : 'పోలవరం ప్రాజెక్టు ఏపీకి జీవనాడి. ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. 2027 నాటికి పునరావాసం పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకెళ్తున్నాం. వీలైతే పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలకముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తి చేస్తాం. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని అధికారులను కోరుతున్నా. అందుకు అవసరమైన సిబ్బందిని ఇస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు గురువారం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం నిర్వాసితులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు.

ఖర్చుచేసే ప్రతిపైసా నిర్వాసితులకే చెందాలి.. 2014లో మేము అధికారంలోకి రాకముందు నిర్వాసితులకు చాలా తక్కువ పరిహారం ఇచ్చారు. 2014లో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక రూ.4,311 కోట్ల పరిహారం చెల్లించాం. కానీ 2019లో వచ్చిన ప్రభుత్వం ఆ ఐదేళ్లలో ఒక్కసారి కూడా మీ గురించి ఆలోచించడం కానీ, పట్టించుకోవడం కానీ చేయలేదు. కనీసం మీ సమస్యల పట్ల ఆలోచించిన దాఖలాలు కూడా లేవు. పోలవరం పూర్తవ్వాలంటే తెలంగాణలోని 7 ముంపు మండలాలు ఏపీలో విలీనం చేయాలని అప్పట్లో ప్రధాని మోదీని ఒప్పించాం. వీలైనంత వరకు మీకు న్యాయం చేసి ఆదుకోవాలని ముందుకెళ్లాం. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వాసితుల అకౌంట్లో రూ.829 కోట్లు జమ చేశాం. 2014-19 మధ్య మా ప్రభుత్వం ఇచ్చే పరిహారం సరిపోదని ప్రతిపక్షంలో ఉన్న జగన్ రూ.10 లక్షలు పరిహారం ఇస్తానన్నాడు..ఇచ్చాడా.? ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్కపైసా బాధితులకు రూపాయి కూడా ఇచ్చింది లేదు. కనీసం వరదలు వచ్చినప్పుడు కూడా మిమ్మల్ని పట్టించుకోలేదు. మళ్లీ రానున్న రోజుల్లో మీ దగ్గరకు వచ్చి అది చేస్తాం.. ఇది చేస్తాం అని చెప్పి మీ వద్దకు వస్తారు. గత పాలకులు పోలవరం ప్రాజెక్టుకు ఏ గతి పట్టించారో చూశాం. 2019లో మా ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020కి ప్రాజెక్టు పూర్తయ్యేది. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయింది. రూ.400 కోట్లతో డయాఫ్రం వాల్ కడితే వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కొట్టుకుపోయింది. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నాం. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారు. ఖర్చు పెట్టే ప్రతిపైసా మీకే చెందాలి. ప్రజల సొమ్మును ప్రజల కోసమే ఖర్చు చేయాలి తప్ప దుర్వినియోగం చేయకూడదు.

గత పాలకులు పోలవరం నిధులు మళ్లించారు.. నేను సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని పనిచేశాను. 33 సార్లు ప్రాజెక్టును సందర్శించాను. దళారులు, మోసగాళ్లకు అవకాశం లేకుండా చేస్తాం. కొందరి పేర్లు తొలగించారని బాధితులు చెబుతున్నారు.. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అర్హులైన ప్రతి ఒక్కరికి పరిహారం చెల్లిస్తాం.. ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను గత పాలకులు ఇతర అవసరాలకు మళ్లించారు. ప్రాజెక్టు సకాలంలో పూర్తయి ఉంటే మీరు ఈ పాటికే స్థిరపడేవారు. పోలవరం హైదల్ ప్రాజెక్టు పూర్తయి ఉంటే రూ.2,500 కోట్ల ఆదాయం వచ్చేది. దాన్ని కూడా ఆలస్యం చేయడంతో అదనపు భారం పడి ఖర్చు కూడా పెరిగింది.

మా ప్రభుత్వంలో మాయమాటలు చెప్పేవారు లేరు.. పునరావాసం కల్పించిన తర్వాత మీ ఆదాయ మార్గాలు, జీవన ప్రమాణాలు పెరగడానికి చర్యలు తీసుకుంటాం మీరు బ్రహ్మాండంగా ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించారు. మీరు ధైర్యంగా ఉండండి. ఇది మీ ప్రభుత్వం. మనందరి ప్రభుత్వం. మంచిని మంచిగా చెప్తే మరింత మంచి జరుగుతుంది. మంచి చేసిన వారికి సహకరించకపోతే తప్పే అవుతుంది. ఈ ప్రభుత్వంలో దళారులు, దొంగలు, మోసగాళ్లు, మాయ మాటలు చెప్పేవారు అస్సలు లేరు.చేసేపని మాత్రమే చెప్పి చేసి చూపిస్తాం. ప్రాజెక్టు కోసం గిరిజనులు ఎక్కువ త్యాగం చేశారు. ఇళ్లు నిర్మించుకునే గిరిజనులకు రూ.75 వేలు అదనంగా మన కూటమి ప్రభుత్వం అందిస్తోంది' అని సీఎం చంద్రబాబు అన్నారు.

పేదరికం లేని సమాజమే నా జీవితాశయం

గత ప్రభుత్వంలో అందరికీ అవమానాలే... ఇక వచ్చే ఐదేళ్లూ అందరికీ రాజపూజ్యం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : పేదరికం లేని సమాజమే తన జీవితాశయ మని అందులో భాగంగానే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ ప్రజలందరి జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఆయన ఆకాం క్షించారు. విజయవాడ తుమ్మలపల్లి కళా క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వ హించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ నిర్వహించిన పంచాంగ శ్రవణంలో చంద్రబాబు పాల్గొన్నారు. టీటీడీ పంచాంగం సహా వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ పంచాంగాలను సీఎం ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సాంస్కృతిక శాఖ వార్షిక ఉత్సవాల క్యాలెం డర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి : భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో విశిష్టమైనవి. చరిత్రను మర్చిపోతే మనం ఉనికి కోల్పోతాం. ఉగాది అంటే మనకు గుర్తొచ్చేది పచ్చడి, పంచాంగ శ్రవణం. షడ్రుచుల మేళవింపు ఉగాది పచ్చడి. నాకు ఇంకా గుర్తుంది. చిన్న వయసులో రచ్చబండపై గ్రామస్తులంతా కూర్చుని ఉగాది శ్రవణం వినేవాళ్లం. మన సంప్రదాయాలు మరిచిపోకూడదనే ఉద్దేశంతో తెలుగు భాష, కళలకు ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో ఆనాడు హైదరాబాద్‌లో హైటెక్ సిటీ పక్కన అవధాన కేంద్రం , అన్నమయ్య క్షేతం, శిల్ప కళా వేదిక ఏర్పాటు చేశాం. ఢిల్లీ ఏపీ భవన్, చెన్నై పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్‌లో ప్రభుత్వం తరపున ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నాం. **(తరువాయి.. 2వపేజీలో)**

మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్

అనకాపల్లి , నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు సుమారు 14 కి.మీ. పొడవైన రోడ్డు విస్తరణ పనులకు నేడు శంకుస్థాపన చేశారు. యువగళం పాదయాత్ర సమయంలో ఈ ప్రాంత ప్రజలు రహదారి విస్తరణ చేపట్టాలని లోకేశ్ కు విన్నవించారు. ఆనాడు లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు. ప్రస్తుతం డబుల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని రూ.347 కోట్లతో 4 లేన్ల రహదారిగా విస్తరించనున్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో చేపట్టే ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ తోపాటు రెండు మైనర్ బ్రిడ్జిలు, 47 కల్వర్టులు నిర్మిస్తారు. ఈ ప్రాంతం విశాఖ-చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (VCIC), జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, స్పెషల్ ఎకనమిక్ జోన్ లో భాగంగా రాంబిల్లి, అచ్యుతపురం, పరవాడ వద్ద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక క్లస్టర్లకు దగ్గరగా ఉంది. దీంతో భవిష్యత్ ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని ఈరోడ్డు విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. ఈ రోడ్డు విస్తరణ ప్రాజెక్ట్ రోడ్డు అనకాపల్లి సమీపంలోని NH-16 జంక్షన్ వద్ద ప్రారంభమై అచ్యుతాపురం వద్ద ముగుస్తుంది. ఈ రహదారి హరిపాలెం రోడ్డు, పూడిమడక రోడ్డు వెంబడి నివాసాలు, పారిశ్రామిక సంస్థలు, మత్స్యకార గ్రామాలకు ప్రధాన కనెక్టివిటీని అందిస్తుంది. ఇది అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 5595.47 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేస్తున్న APSEZ కు ప్రధాన కనెక్టివిటీని అందిస్తుంది. అనకాపల్లి సమీపాన నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.4లక్షల కోట్లతో కొత్తగా నిర్మించతలపెట్టిన స్టీల్ ప్లాంట్ కు కూడా కనెక్టివిటీని సులభతరం చేస్తుంది. ఈ రహదారి APSEZ, 180 పరిశ్రమల చుట్టూ ఉన్న ఇతర కీలక పారిశ్రామిక ప్రాంతాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అనుసంధానించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతిరోజూ లక్ష కంటే ఎక్కువ మంది ఉద్యోగుల రోజువారీ రాకపోకలను సులభతరం చేస్తుంది. అచ్యుతాపురం, మునగపాక, అనకాపల్లి మండల నివాసితులకు ట్రాఫిక్ కష్టాలను తగ్గిస్తుంది.

400 ఎకరాల భూమిపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ కీలక ప్రకటన

హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి తమదేనని టీజీఐఐసీ చేసిన ప్రకటనపై హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) స్పందించింది. టీజీఐఐసీ ప్రకటనను హెచ్‌సీయూ ఖండించింది. ఈ మేరకు హెచ్‌సీయూ రిజిస్ట్రార్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 జులైలో అక్కడ ఎలాంటి సర్వే నిర్వహించలేదని, ఇప్పటి వరకు భూమి ఎలా ఉందన్న దానిపై ప్రాథమిక పరిశీలన మాత్రమే చేశారని ఆ ప్రకటనలో తెలిపారు. హద్దులకు అంగీకరించినట్లు టీజీఐఐసీ చేసిన ప్రకటనను ఖండిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు భూమికి సరిహద్దులు గుర్తించలేదని, దీనిపై హెచ్‌సీయూకి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. ఆ భూమిని విశ్వవిద్యాలయానికే ఇవ్వాలని చాలాకాలంగా కోరుతున్నామని, భూమి కేటాయించడంతో పాటు పర్యావరణం, జీవ వైవిధ్యాన్ని కాపాడాలని మరోసారి కూడా ప్రభుత్వాన్ని కోరతామని అన్నారు.

మోదీ చాలా తెలివైన నేత: ట్రంప్ కితాబు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధాని మోదీ అత్యంత తెలివైన నేత అని, తనకు గొప్ప స్నేహితుడని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొనియాడారు. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై ప్రతీకార సుంకాలు అమల్లోకి రానున్న తరుణంలో ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించు కున్నాయి. అమెరికా అధ్యక్ష భవనం శ్వేతసౌధంలో ఆయన మోదీని ఉద్దేశించి ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చలు ఆశాజనకంగా జరుగుతున్నాయని, అవి సత్ఫలితాలు ఇవ్వబోతున్నాయని పేర్కొన్నారు. అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటని, ఇది దారుణం, అత్యంత క్రూరమని ట్రంప్ వ్యాఖ్యానించారు. మోదీ చాలా తెలివైన నేత, తనకు మంచి స్నేహితుడని కితాబిస్తూ తాము కలిసినప్పుడు బాగా మాట్లాడు కుంటున్నామని పేర్కొన్నారు. వాణిజ్య చర్చలు బాగా జరుగుతున్నాయన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ వాణిజ్య ఒప్పందం కోసం భారత్‌లో పర్యటిస్తుండగా, అమెరికాలో ఆ దేశ విదేశాంగ శాఖ ఉప మంత్రి క్రిస్టోఫర్ లాండాతో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ శుక్రవారం చర్చలు జరిపారు. వాణిజ్యం, రక్షణ, టెక్నాలజీ, వలసలపై వారి మధ్య చర్చలు జరిగాయి.

జమిలి ఎన్నికలపై వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు

బెంగళూరు, నేటి పత్రిక ప్రజావార్త : ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంపై ఎన్డీయే సర్కారు ఆసక్తి చూపిస్తోంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంటు ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలన్నది ఈ విధానం ముఖ్య ఉద్దేశం. ఇప్పటికే దీనిపై మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిషన్ కూడా ఏర్పాటైంది. కోవింద్ కమిషన్ నివేదికను కూడా సమర్పించింది. తాజాగా ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రాముఖ్యత-సవాళ్లు-ప్రభావం పేరిట కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో బెంగళూరులో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు ఆసక్తికర అంశాలు వెల్లడించారు. 1952లో తొలిసారి సార్వత్రిక ఎన్నికలు జరిగాయని, అనంతరం 1967 వరకు దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగాయని వివరించారు. ఆ తర్వాత ఇందిరాగాంధీ వచ్చాక పరిస్థితి మారిపోయిందని అన్నారు. తనకు నచ్చని రాష్ట్రాల ప్రభుత్వాలను ఇందిరాగాంధీ రద్దు చేయడంతో... అసెంబ్లీ ఎన్నికల సమయాలు మారిపోయాయని వెంకయ్యనాయుడు తెలిపారు. గతంలో జమిలి ఎన్నికలు నిర్వహించింది కాంగ్రెస్ హయాంలోనే అని, మరి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడెందుకు జమిలి ఎన్నికలు వద్దంటుందో చెప్పాలని నిలదీశారు.

నాలా చట్టం రద్దుపై త్వరలోనే విధివిధానాలు

-నారెడ్కో ప్రతినిధులతో మంత్రి అనగాని సత్యప్రసాద్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : నాలా చట్టం రద్దుపై త్వరలోనే విధివిధానాలను విడుదల చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. అభి వృద్ధికి ఆటంకంగా ఉన్న నాలా చట్టాన్ని రద్దు చేయాలని సీఎం చంద్రబాబు కలెక్టర్ల కాన్ఫ రెన్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రియాల్టీ సంస్థ అయిన నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్ మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) ప్రతినిధులు గురువారం అమరావతిలోని సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. నాలా చట్టం రద్దు వెనుక మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి ఎంతో ఉందని వారు చెప్పారు. మంత్రి సత్యప్రసాద్ కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వారితో మంత్రి అనగాని మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడూ డైనమిక్ నిర్ణయాలు తీసు

ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించింది

-కుప్పం నియోజకవర్గం పర్యటనలో నారా భువనేశ్వరి వెల్లడి

కుప్పం, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ ప్రజలకు మళ్లీ ఐదేళ్ల తర్వాత స్వాతంత్ర్యం లభించిందని, కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరుగుతుందని నారా భువనేశ్వరి అన్నారు. చంద్రబాబు పాలనా సామర్థ్యం గురించి రాష్ట్ర ప్రజలకు తాను ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పారిశ్రామికవేత్తలు ఏపీలో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నారంటే అందుకు చంద్రబాబు పై ఉన్న నమ్మకమే కారణమన్నారు. 2వ రోజు కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా మోడల్ కాలనీ, కృష్ణదాసపల్లి, జరుగు గ్రామాల్లో నారా భువనేశ్వరి పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమాల్లో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. మహిళలు తమపై తాము నమ్మకం పెట్టుకుని ధైర్యంగా ముందడుగు వేయాలని సూచించారు.

అందరికీ సంక్షేమం.. ఎన్నికల్లో గెలుపు కోసం కొందరు సాధ్యం కాని హామీలు ఇస్తారు. కానీ చంద్రబాబు చెప్పారంటే చేతల్లో చేసి చూపిస్తారు. ప్రజలు కాస్త ఓపిక పట్టాలి. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయి. ఒక ఇండస్ట్రీ తీసుకురావాలంటే అంత ఆషామాషీ కాదు. 2019 తర్వాత చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఏపీ నిలిచేది. పోలవరం పూర్తయ్యేది. రాష్ట్రాన్ని చంద్రబాబు నిలబెడతారు. రాష్ట్రమంతటా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షిత నీరు, సోలార్ ప్యానల్స్ ఏర్పాటు సహా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ నీటి సమస్య తీర్చేందుకు వీలైనంత త్వరగా హంద్రీనీవా పూర్తిచేసి అందరికీ నీరు అందిస్తారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఏం చేసిందో ప్రజలు,పారిశ్రామివేత్తలకు తెలుసు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపారు.

డ్వాక్రాతో మహిళల జీవితాల్లో వెలుగులు.. ఇక్కడికి వచ్చిన మహిళలందరికీ ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు. మహిళలు ఒకసారి చెబితే చాలు చక్కగా వింటారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు ఉండబట్టే కుటుంబాన్ని తీర్చిదిద్దుతున్నారు. మహిళల కోసం సీఎం చంద్రబాబు అనేక పథకాలు అమలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో మగవారిని మించి విజయాలు సాధించాలని చంద్రబాబు కోరుకుంటూ ఉంటారు. మహిళలు డబ్బు కోసం ఇబ్బంది పడకూడదని, వారు ఆర్థికంగా బలంగా ఉండాలనే ఉద్దేశంతోనే డ్వాక్రా సంఘాలు స్థాపించారు. ఒకప్పుడు వందా, రెండు వందల కోసం ఇతరులపై ఆధారపడిన స్త్రీలు నేడు బ్యాంకు లావాదేవీలు స్వయంగా చూసుకునే స్థాయికి చేరారంటే అది చంద్రబాబు తీసుకొచ్చిన డ్వాక్రాతోనే సాధ్యమైంది. మగవాళ్లతో సమానంగా ఉద్యోగాలు చేస్తూనే ఇంటి బాధ్యతలు విజయవంతంగా నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువులు చూసుకుంటున్నారు. వ్యాపారంలోకి రాకముందు నేను ఇంటి నుంచి బయటకు రావాలంటేనే సిగ్గుపడేదాన్ని. వచ్చాక నేను ఏమైనా చేయగలను అనే ధైర్యం బిజినెస్‌లోకి అడుగుపెట్టాకే వచ్చింది. మీ గౌరవం కోసం మీరు పనిచేయండి. మహిళలు తమ సంపాదనను ముందుగా వారి అవసరాలకు వినియోగించుకోవాలని నారా భువనేశ్వరి అన్నారు.

అహంభావం, కక్షతో గత ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు నష్టం కలిగించింది

-పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల పరిశీలన అనంతరం అధికారులతో సమీక్ష

పోలవరం, నేటి పత్రిక ప్రజావార్త : పోలవరం ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వం క్షమించరాని తప్పులు చేసింది. కక్ష, అహంభావంతో ఇష్టానుసారంగా వ్యవహరించింది. ప్రాజెక్టు విషయంలో తొందరపడొద్దని పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్రం చెప్పినా వినకుండా వారికి నచ్చినట్లు ప్రవర్తించారు. రివర్స్ టెండర్ పేరుతో రాజకీయం చేశారు. దీని వల్ల రూ.2,782 కోట్లు అదనపు భారం పడింది. కాంట్రాక్టర్లను మార్చారు. పోలవరం ప్రాజెక్టు నా సెంటిమెంట్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను గురువారం సీఎం పరిశీలించారు. అనంతరం అక్కడే అధికారులతో సమీక్ష నిర్వహించి, మీడియాతో మాట్లాడారు.

9 నెలల్లోనే 3 సార్లు పరిశీలించా.. 'ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక 3వసారి పోలవరం ప్రాజెక్టును పరిశీలించడానికి వచ్చాను. 9 నెలల్లోనే ప్రాజెక్టును గాడినపెట్టాం. సులభంగా పూర్తవ్వాల్సిన ప్రాజెక్టును నాశనం చేశారు. 2019లో మేం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉండుంటే 2020 ఆగస్టు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసేవాళ్లం. పోలవరం ఏపీకి జీవనాడి. ఇది పూర్తైతే 7.20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు, 23.50 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు 28.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించవచ్చు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, విశాఖపట్నంలోని ప్రజలు, పరిశ్రమలకు 23 టీఎంసీల నీటిని అందించవచ్చు. ఈ ఏడాది 4 వేలటీఎంసీల నీరు సముద్రంలో కలిసింది. ఈ నీళ్లలో కనీసం నాలుగైదు వందల టీఎంసీల నీళ్లు వినియోగించుకున్నా రాష్ట్రంలో కరువు అనేది లేకుండా చేయవచ్చు.'

ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వమే శ్రద్ధ తీసుకోవాలని నీతి ఆయోగ్ తెలిపింది.. ఏపీ విభజన చట్టంలో పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా చేర్చారు. ఆ సమయంలో ముంపునకు గురయ్యే 7 మండలాలు తెలంగాణలో ఉన్నాయి. దీని వల్ల ప్రాజెక్టు ముందుకు సాగదని కేంద్రానికి తెలిపి, ఆ 7 మండలాలు ఏపీలో కలపాలని అడగడం వల్ల పార్లమెంట్ సమావేశాలకంటే ముందుగానే కేబినెట్‌లో ఆమోదించి ఆర్డినెన్స్ ఇచ్చారు. కేంద్ర ప్రాజెక్టులు పూర్తైన వాటి చరిత్ర చూస్తే ఆశాజనకంగా లేదని, ప్రాజెక్టును పూర్తి చేయాలంటే రాష్ట్రమే శ్రద్ధ తీసుకుంటే బాగుంటుందని నీతి ఆయోగ్ చెప్పింది. ఎట్టి పరిస్థితుల్లో ప్రాజెక్టును పూర్తిచేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టి 2019 నాటికి 73 శాతం పూర్తి చేశాం. ఒకేరోజున 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ వేసి గిన్నీస్ రికార్డ్ సాధించాం. 414 రోజుల్లో 1,397 మీటర్ల డయాఫ్రం వాల్ నిర్మించాం. నేరుగా 28 సార్లు సందర్శించా, 82 సార్లు వర్చువల్‌గా సమీక్ష చేశాను.

2026 ఫిబ్రవరి 26కి ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1 పూర్తి.. 2019లో ప్రభుత్వం మారడంతో ప్రాజెక్టు పరిస్థితి ఏమైందో అంతా చూశారు. డయాఫ్రం వాల్‌ను దెబ్బతీశారు. కాఫర్ డ్యాం సకాలంలో పూర్తి చేసి ఉంటే డయాఫ్రం వాల్ దెబ్బతినేది కాదు. మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పరిస్థితిని అధ్యయనం చేయడానికి విదేశీ నిపుణులు వచ్చి పరిశీలించారు. కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాలని సూచించారు. మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రం వాల్ నిర్మించాల్సి వచ్చింది. అంతకు ముందు ఖర్చు పెట్టిన రూ.440 కోట్లు వృథా అయ్యాయి. డయాఫ్రంవాల్‌ను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేస్తాం. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1ను 2026 ఫిబ్రవరి 26కు పూర్తి చేస్తాం. ఎడమ కాలువ 2026 జూన్‌కు పూర్తవుతుంది. ఈసీఆర్ఎఫ్ గ్యాప్-2 మాత్రం 2027 డిసెంబర్‌కు గడువు పెట్టారు. టెక్నికల్ సమస్యలు ఉంటే తప్ప 2027 ఏప్రిల్ లేదా జూన్‌కు పూర్తి చేయాలని ఆదేశించాను. ఫేజ్-1ఏ, ఫేజ్-2 1ఏ, 1బీ పూర్తికి భూ సేకరణ ఇంకా చేయాల్సి ఉంది. దాదాపు 26 పునరావాస కాలనీలు పూర్తయ్యాయి. మరో 49 పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 14,329 మందిని పునరావాసాలకు తరలించాం, మరో 6,578 మందిని తరలించాల్సి ఉంది. ఇవన్నీ పూర్తి చేయాలంటే మరో రూ.500 కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సి ఉంది. రూ.972 కోట్లు ఖర్చు చేసి ఈ ఏడాది నవంబర్‌కు ఫేజ్-1ఏలో ఉండే అందరికీ పునరావాసం కల్పిస్తాం. జూలై 2026కు ఫేజ్-1బి కింద 6 మండలాల్లో 48 పునరావాసాలు పూర్తి చేస్తాం. ఫేజ్-1ఏ, ఫేజ్-2 1ఏ, 1బీకి కలిసి రూ.6,270 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఫేజ్-1లో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణం ఉంటుంది. వాస్తవానికి ప్రాజెక్టు ఎత్తు 45.74 మీటర్లు. 2019కి ముందు ఈ ఫేజ్1, ఫేజ్2 ప్రస్తావన లేదు. ఇది కూడా గత పాలకుల తప్పే. కానీ మళ్లీ వెనక్కి వెళ్తే ప్రాజెక్టు ఉనికికే ప్రమాదం. మొదట ఫేజ్1 పూర్తి చేసి తర్వాత ఫేజ్-2 మొదలుపెడతాం.

పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు.. భూసేకరణ, పునరావాసానికి కూడా అదనంగా ఖర్చు అవుతోంది. ఒక వ్యక్తి చేసిన తప్పులను రాష్ట్రం ఏ విధంగా భరించాల్సి వస్తుందనడానికి ఇదొక ఉదాహరణ. సాగునీరు వచ్చినప్పుడు రైతులు ఆనందంగా ఉంటారు. కానీ ప్రాజెక్టు కోసం తరాలుగా ఉంటున్న ప్రజలు కూడా వారి భూములు, ఆవాసాలు కోల్పోవాల్సి ఉంటుంది. వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అదనంగా ఇంకా ఏమీ చేయగలుగుతామో ఆలోచించి, వారి జీవితాల్లో మరింత మార్పులు తీసుకురావాల్సి ఉంది. పునరావాస ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టే అంశాన్ని కూడా పరిశీలిస్తాం. ఎంఎస్ఎంఈలు పెట్టుకుంటే ప్రభుత్వ తరపున ప్రోత్సహిస్తాం.

ప్రాజెక్టును నేనే పూర్తి చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.. మళ్లీ భగవంతుడి ఆశీర్వాదంతో అవకాశం లభించింది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. కేంద్రం నుంచి అవసరమైన నిధులు వచ్చాయి. ప్రాజెక్టును నేను పూర్తి చేస్తున్నందుకు సంతోషం కలుగుతోంది. పోలవరం నిర్మాణాన్ని ఆదర్శంగా తీసుకుని పోలవరం-బనకచర్ల అనుసంధానం చేపట్టి పూర్తి చేస్తాం. ఈ రెండూ చేయగలిగితే జీవితానికి పరమార్థం ఉంటుంది. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో నేను, నా మిత్రుడు పవన్ కళ్యాణ్ ఈ ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

ప్రధాని మోదీకి ప్రైవేట్ కార్యదర్శిగా నిధి తివారీ

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :ప్రధాని నరేంద్ర మోదీకి ప్రైవేట్ కార్యదర్శిగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి నిధి తివారీని నియమిస్తూ సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2014 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి అయిన నిధి తివారీ ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో డిప్యూటీ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. మార్చి 29న వెలువడిన ఉత్తర్వుల ప్రకారం, కో-టెర్మినస్ ప్రాతిపదికన ప్రైవేట్ కార్యదర్శిగా తివారీ నియామకాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది.

రైల్వే టికెట్ కౌంటర్‌లో కొన్నా.. ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చు!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కేంద్ర రైల్వేశాఖ ప్రయాణికుల కోసం మరో సదుపాయం అమలుచేస్తున్నట్లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. ప్రయాణికులు ఇకపై తమ టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. రైల్వే టికెట్ కౌంటర్‌లో కొన్నా.. దానిని ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్ పోలీసులు ఏసీ హెల్మెట్లు

గుజరాత్, నేటి పత్రిక ప్రజావార్త : వేసవి కాలంలో వేడి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు గుజరాత్‌లోని ట్రాఫిక్ విభాగం వినూత్న ఆలోచన చేసింది. సూర్యుడి తాపం నుంచి రక్షణ పొందేందుకు వడోదరలోని ట్రాఫిక్ పోలీసులు ఏసీ హెల్మెట్లు వినియోగిస్తున్నారు. ఎండాకాలం కాసేపు బయటకు వెళితేనే వేడికి అల్లాడిపోతాం. ఎక్కువసేపు ఎండలో ఉండాలంటే భయపడిపోతాం. అలాంటిది ట్రాఫిక్ సిబ్బంది గంటలకొద్ది ఎండ వేడిని తట్టుకుంటూ తమ విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వడోదర ట్రాఫిక్ విభాగం వినూత్నంగా ఆలోచించి ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లను అందించింది. నగరంలోని 500 మందికి పైగా ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు అందజేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు మండుటెండల్లోనూ ప్రశాంతంగా విధులు నిర్వహిస్తున్నారు.

క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం

-మత పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన సీఎం చంద్రబాబు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ ఏ ప్లస్ కన్వెన్షన్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు. 'పేదరికంలో ఉన్న ముస్లిం కుటుంబాలను ఆర్థికంగా పైకి తీసుకొస్తాం. ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది. వక్ఫ్ బోర్డు ఆస్తులకు రక్షణ కల్పిస్తాం. ముస్లిం సోదరులతో ఇఫ్తార్ విందులో పాల్గొనడం సంతోషంగా ఉంది. 40 ఏళ్లుగా ఇఫ్తార్ విందులో పాల్గొంటున్నా. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయిక పవిత్ర రంజాన్ మాసం. రంజాన్ మాసమంతా కఠోర దీక్షతో ఉండే ముస్లిం సోదరులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఇదొక పవిత్రమైన ఆచారం. సమాజ శ్రేయస్సు కోసం ముస్లిం సోదరులు దువా చేస్తున్నారు. ఆర్థికంగా బాగున్నవారు పేదలకు సాయం చేయడమే ఖురాన్ నేర్పించిన మంచి గుణం' అని అన్నారు.

ముస్లింలతో టీడీపీకి బలమైన అనుబంధం.. 'ముస్లింలతో టీడీపీకి బలమైన అనుబంధం ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ముస్లింలకు మేలు జరిగింది టీడీపీ హయాంలోనే. మొట్టమొదటిసారి హైనాన్స్ కార్పొరేషన్‌ను ఎన్టీఆర్ ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే ఉర్దూను రెండో భాషగా చేశాం. హైదరాబాద్ నుంచి మక్కాకు వెళ్లేందుకు హజ్ భవనం నిర్మించాం. వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణకు టీడీపీ కృషి చేసింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లో, విభజన తర్వాత కర్నూలులో ఉర్దూ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం. కడపలో హజ్‌హౌస్ నిర్మించాం. విజయవాడలో నిర్మించతలపెడితే గత ప్రభుత్వం నిలిపేసింది. 2014-2019 మధ్య రూ.163 కోట్లతో 32,722 మంది మైనార్టీ వధువులకు దుల్హన్ సాయం అందించాం. పండుగ నాడు పేద ముస్లింలు పస్తులుండకూడదని రంజాన్ తోఫా అందించాం.'

మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఇమామ్, మౌజన్‌లకు గౌరవవేతనం.. మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లుగానే ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్‌లకు రూ.5 వేలకు గౌరవ వేతనం పెంచాం. మొన్నటి బడ్జెట్‌లో ముస్లిం మైనారిటీలకు రూ.5,434 కోట్లు కేటాయించాం. గత బడ్జెట్ కంటే రూ.13 వందల కోట్లు అదనంగా కేటాయించాం. మత సామరస్యాన్ని కాపాడటమే కాకుండా అన్ని విధాలా ముస్లింలను పైకి తీసుకొస్తాం. జకాత్ స్ఫూర్తితో మీరు సంపాదించిన దాంట్లో కొంత పేదలకు ఖర్చు చేసేందుకు ముందుకు రండి. పేదరిక నిర్మూలన కోసం పీ4 కార్యక్రమాన్ని ఈ మాసంలోనే ప్రవేశపెడుతున్నాం. అగ్రభాగాన ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలకు సహకారం అందిస్తారు. ఇప్పటికీ పేదలు మూడు పూట్లా సరైన తిండి, చదువు లేక ఆర్థిక అసమానతలకు గురవుతున్నారు. నేను పేదల పక్షం ఉండాలనేది నా జీవితాశయంగా పెట్టుకున్నా. అందుకే పీ4 విధానంతో పేదరికం నుంచి పైకి తెచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నాం.' అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. విజయవాడ ఎన్ఏసీ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ అంటూ ఉర్దూలో ముందస్తు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. అందరి ప్రార్థనలు సఫలం కావాలని ఆకాంక్షించారు. అల్లాహ్ చల్లని ఆశీస్సులతో అందరూ బాగుండాలని ఆయన కోరుకున్నారు.

టోపీ, కండువా ధరించి నమాజ్.. ఇక ముస్లిం సంప్రదాయం ప్రకారం టోపీ, పవిత్ర కండువా ధరించిన వైయస్ జగన్ ముస్లిం సోదరులతో కలిసి నమాజ్ చేశారు. అనంతరం వారితో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులతో పాటు పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఇవియంలు భద్రపరిచిన గోడౌన్ ను తనిఖీ

గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా గురువారం ఉదయం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఇవియంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ పరిశీలించారు. సిసిటీవి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. ఇవియంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ షేక్. ఖాజావలి, గుంటూరు ఆర్డిఓ కె.శ్రీనివాసరావు, అడిషనల్ ఫైర్ ఆఫీసర్ కృష్ణా రెడ్డి, ఆర్ అండ్ బి ఎలక్ట్రికల్ డి.ఈ ఏ. నాగేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బిల్లా సునీల్, టిడిపి పార్టీ తరపున ఓంకార్, కంచర్ల శివరామయ్య, బిజెపి పార్టీ తరపున చరక కుమార్ గౌడ్, జనసేన పార్టీ తరపున త్రినాధ్, వైయస్సార్ పార్టీ తరపున అత్తోట జోసఫ్, బిఎస్పీ పార్టీ తరపున చిరతనగండ్ల వాసు, ఆమ్ ఆద్మీ పార్టీ తరపున డా. సేవా కుమార్, గుంటూరు పశ్చిమమండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాకు వద్దంటూ టీడీపీ ప్రధాన కార్యాలయానికి తరలివచ్చిన కార్యకర్తలు

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఉమ్మడి కృష్ణాజిల్లా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వ్యవహారశైలి మొదటి నుంచి వివాదాస్పదంగా ఉంది. గతంలో ఆయనకు టీడీపీ హైకమాండ్ పలు హెచ్చరికలు చేసినా, ఆయన ధోరణిలో మార్పు రాలేదని ఇటీవల పరిణామాలు చెబుతున్నాయి. కొన్ని రోజుల కిందట మరోసారి కొలికపూడి ఓ వివాదానికి కేంద్ర బిందువు అయ్యారు. తిరువూరు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత అలవాల రమేష్ రెడ్డిపై చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కొలికపూడి ఏకంగా టీడీపీ నాయకత్వానికే అల్టిమేటం ఇచ్చాడు. ఈ విషయాన్ని టీడీపీ హైకమాండ్ సీరియస్ గా తీసుకుంది. ఈ వ్యవహారం పరిశీలనలో ఉండగానే, నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. కొలికపూడికి వ్యతిరేకంగా తిరువూరు టీడీపీ కార్యకర్తలు నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి భారీగా తరలివచ్చారు. మాకు కొలికపూడి వద్దు అంటూ వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో ఉన్న రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తిరువూరు కార్యకర్తలను సముదాయించారు. తిరువూరు నుంచి వచ్చిన ముఖ్య నేతలతో పల్లా శ్రీనివాసరావు సమావేశమయ్యారు. పార్టీ గీత దాటితే ఎవరినీ ఉపేక్షించేది లేదని, క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యకర్తల అభిప్రాయాలను చంద్రబాబు, నారా లోకేశ్ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

అప్పుల పాలవుతారు, మరింత పేదలవుతారు

- భారీ ఖర్చుతో పెళ్లిళ్లు జరిపించడంపై జయప్రకాశ్ నారాయణ కీలక వ్యాఖ్యలు. .

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : భారత్ లో పెళ్లిళ్లు ఏ రేంజ్ లో జరిపిస్తారో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఎవరి స్థాయికి తగ్గట్లుగా వారు ఖర్చు చేస్తారు. కొందరు లక్షలు వెచ్చిస్తే, మరికొందరు కోట్ల రూపాయలు ఖర్చు పెడతారు.డబ్బునోళ్ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అంగరంగ వైభవంగా వివాహం జరిపిస్తారు. పెళ్లిని ఎంత గ్రాండ్‌గా జరిపిస్తే అంతగా తమ స్టేటస్ పెరుగుతుందని భావించే వారూ ఉన్నారు. ఎన్ని కోట్ల రూపాయలైనా సరే ఖర్చు చేయడానికి అస్సలు వెనుకాడరు. తాము జరిపించే పెళ్లి గురించి పది మంది గొప్పగా చెప్పుకోవాలని ఆశపడే వారూ ఉన్నారు. అయితే, పెళ్లిళ్లకు భారీగా ఖర్చు పెట్టడంపై లోక్ సత్తా వ్యవస్థాపకులు జయప్రకాశ్ నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలా చేయడం వల్ల పేదలు మరింత పేదలు అవుతారని, మధ్య తరగతి వారు అప్పుల పాలవుతారని ఆయన అభిప్రాయపడ్డారు. వివాహాలకు భారీగా ఖర్చు చేయడం.. ఉత్పాదకత లేని, వృధా ఖర్చులకు దారితీస్తుందన్నారు.ఒక సంవత్సరంలో దాదాపు 10 మిలియన్ల జంటలు వివాహాలను జరుపుకుంటారు. ఒక అంచనా ప్రకారం సగటు ఖర్చు దాదాపు 1 మిలియన్ (10 లక్షలు) అని తెలుస్తోంది. వాస్తవ ఖర్చు బహుశా పేదలకు 2 లక్షల ఉండొచ్చు. అదే సంపన్నులకు 2 కోట్ల వరకు ఉంటుంది. సూపర్ రిచ్‌లు దీనికి మరెన్నో రెట్లు ఖర్చు చేస్తారు. మనం వివాహాల కోసం సంవత్సరానికి 10 ట్రిలియన్లకు పైగా ఖర్చు చేస్తున్నాం. అది మన GDPలో దాదాపు 3శాతం.దీనికి ప్రభుత్వాన్ని నిందించలేము. దీనికి పరిష్కారం మన దగ్గరే ఉంది. పెళ్లికి చేసే ఖర్చులో ఎక్కువ భాగం ఆదా చేసి, ఉత్పాదక ఆస్తులను సంపాదించడానికి లేదా ఇల్లు లేదా వ్యాపారాన్ని నిర్మించడానికి తిరిగి ఉపయోగించినట్లయితే, వారి భవిష్యత్తు మరింత సురక్షితంగా ఉంటుంది. అలాగే సమాజం ప్రయోజనం పొందుతుంది. ఇది మన జీవితాలను మార్చగల, పేదరికాన్ని అంతం చేయగల చర్య. వివాహాలకు భారీగా ఖర్చు చేసే ఆచారాన్ని మనం మార్చుకోవాలి. వివాహం అనేది ఆర్థిక సమస్యలకు, దివాలా తీయడానికి మూలం కాకుండా ఉండాలి. మన భవిష్యత్తును నిర్మించడానికి ఆనందకరమైన సందర్భంగా ఉండాలి" అని జయప్రకాశ్ నారాయణ ఆకాంక్షించారు.

51 మండలాలకు కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపు

రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : "రాష్ట్రంలోని 51 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రకటించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నాం" అని రెవిన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా ప్రకటించారు. శుక్రవారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ కార్యాలయంలో హైబ్రిడ్ మోడ్‌లో నిర్వహించిన కరువు ప్రభావ కమిటీ సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ మండలాలపై అధికారిక ఉత్తర్వులు రాబోయే రెండు, మూడు రోజులలో వెలువడనున్నాయన్నారు. సిసోడియా మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్లు మరియు సంబంధిత శాఖలు సమర్పించిన నివేదికలను కమిటీ నిశితంగా పరిశీలించిందని చెప్పారు. "ప్రభుత్వం ఎండ ప్రభావిత మండలాల కోసం అవసరమైన చర్యలను తీసుకోవడానికి కట్టుబడి ఉంది. ఈ సమావేశం, పరిస్థితిని సమగ్రంగా అంచనా వేసి, సాంకేతిక పరిశీలన ఆధారంగా నిర్ణయం తీసుకునేందుకు కీలకంగా నిలిచింది" అని పేర

కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసే 4 పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానం

మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త : కృష్ణాజిల్లాలోని అర్హులైన అభ్యర్థుల నుండి కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసే 4 పోస్టులకు సంబంధించి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి డిడిఎన్ నటరాజు ఒక ప్రకటనలో తెలిపారు. మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం కన్సల్టెంట్ జనరల్ ఒక పోస్ట్‌కు గణాంకాలలో డిగ్రీతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానము 5 సంవత్సరాల అనుభవము కలిగి ఉండాలన్నారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ జనరల్ పోస్ట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ జనరల్ ఒక పోస్ట్ కు కసంబంధించి సైన్సో గాని, సోషల్ సైన్స్ లో గాని డిగ్రీతో పాటు 5సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. అలాగే అకౌంటెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్ జనరల్ ఒక పోస్ట్‌కు సంబంధించి బికాం కంప్యూటర్స్ లేదా బిఎస్సి కంప్యూటర్స, పిజిడిసిఏ లేదా డిసిఏ తోపాటు 3 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మెరిట్ ఆధారంగా జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లాకు చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. మచిలీపట్నం ప్రధాన కార్య స్థానంలో మాత్రమే ఉండి పని చేయాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత దరఖాస్తులు వచ్చే ఏప్రిల్ నెల 15వ తేదీలోగా వారి కార్యాలయానికి అందజేయాలన్నారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు వారి కార్యాలయం నుండి ఇంటర్వ్యూ తేదీలను తెలియజేయడం జరుగుతుందన్నారు.

ఇక ఖాతాకు నలుగురు నామినీలు.. 'బ్యాంకింగ్' బిల్లుకు ఆమోదం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఇప్పటివరకు ఒక బ్యాంకు ఖాతాకు ఒకరే నామినీగా ఉండేవారు. ఇక నుంచి మనం గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా పెట్టుకోవచ్చు. ఇదే రూల్ బ్యాంకుల ఫిక్స్‌డ్ డిపాజిట్ల(ఎఫ్‌డీ)కు కూడా వర్తిస్తుంది. ఈమేరకు ప్రతిపాదనలతో కూడిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024పై పార్లమెంటు ఆమోద ముద్ర వేసింది. ఇవాళ రాజ్యసభలో ఈ బిల్లుకు మెజారిటీ ఓట్లు లభించాయి. అంతకుముందు 2024 డిసెంబరులో ఈ బిల్లుకు లోక్‌సభలో ఆమోదం లభించింది. లాకర్ల విషయానికి వస్తే.. వాటికి పాత పద్ధతిలోనే ఒకరికి మించి నామినీలను పెట్టుకోవచ్చు. అయితే వారికి ప్రయారిటీని నిర్ణయించుకోవాలి. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024లోని కీలక అంశాలు ఇలా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పరిధిలోని బ్యాంకులు ఇప్పటివరకు ప్రతీ రెండో శుక్రవారం, నాలుగో శుక్రవారంలలో ఆర్‌బీఐకు రిపోర్టింగ్ చేసేవి. అవి ఇక నుంచి ప్రతినెలా 15న, 30న రిపోర్టింగ్ చేయాలి. ప్రభుత్వం వద్ద నమోదైన కంపెనీలలోని డైరెక్టర్ల కనీస వాటా మొత్తాన్ని రూ. 5 లక్షల నుంచి రూ. 2 కోట్లకు పెంచారు. డైరెక్టర్ హోదాలో ఉన్నవారు కంపెనీలోని 10 శాతం ఈక్విటీని కలిగి ఉండొచ్చు. సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచారు. కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టరుగా (Bank Account Nominees) ఉండేవారు, రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులోనూ సభ్యుడిగా వ్యవహరించొచ్చు. ఆడిటర్లకు వేతనాల చెల్లింపులో బ్యాంకులకు స్వేచ్ఛను కల్పించే నిబంధన సైతం సవరించిన చట్టంలో ఉంది.

రుణాల ఎగవేతదారులపై కఠిన చర్యలు.. ఉద్దేశపూర్వకంగా బ్యాంకుల అప్పులను ఎగ్గొట్టే వాళ్లను వదిలేది లేదని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తేల్చి చెప్పారు. వాళ్ల నుంచి అప్పులను వసూలు చేసేందుకు బ్యాంకులు తగిన చర్యలు చేపడతాయని స్పష్టం చేశారు. బ్యాంకుల అప్పులను 'రైట్ ఆఫ్' చేయడం అంటే మాఫీ చేసినట్టు కాదన్నారు. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024పై రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానమిస్తూ నిర్మల ఈ వివరాలను వెల్లడించారు.

మానవ ప్రాణ శక్తి కేంద్రాల ప్రేరేపణ ద్వారా ఆరోగ్యం ఆనందం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : గుడివాడ గిరిజ స్కూల్ ఆఫ్ నర్సింగ్ వద్ద గురువారం మానవ ప్రాణ శక్తి కేంద్రాల గురించి అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు యోగ శక్తి సాధన సమితి విజయవాడ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు చికిత్స మరియు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పి రాధాకృష్ణ మదర్ తెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు కోఆర్డినేటర్ గా వ్యవహరించారు.డాక్టర్ మాకాల సత్యనారాయణ శిక్షణ ఇస్తూ మాన దేహములోనే 500 జతల ప్రాణశక్తి కేంద్రాలు ఉన్నాయని వాటిని ప్రేరేపించడం ద్వారా ప్రాణశక్తిని పెంచుకోవడం వలన ఆరోగ్యం ఆనందం లభిస్తుందని,అందులో ముఖ్యమైనవి తెలియజేసి వాటిని ప్రేరేపించే విధానాన్ని విద్యార్థులకు అలవాటు చేశారు.మన దేహంలో ఉన్న సహస్రారము, బ్రహ్మనాడి ముందు జుట్టు నుండి 7 వేళ్ళు వెనుకకు సెంటర్ లైన్ మీద ఉందని దానిని ప్రేరేపించడం ద్వారా శారీరక, మానసిక సమస్యలు తగ్గించుకోవచ్చు అని తెలిపారు. వెనుక జుట్టు నుండి క్రిందికి నాలుగు వేళ్ళు దూరంలో ఉన్న డి యు 14 శక్తి కేంద్రాన్ని చైతన్య పరచడం ద్వారా వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవచ్చని, అలాగే మెడ పక్కగా గల జిబి 21 కేంద్రాన్ని ప్రెషర్ ఇవ్వడం ద్వారా హార్మోన్స్ సమస్యలని బ్యాలెన్స్ చేయవచ్చు అని తెలిపారు.చెస్ట్ మీద స్టెర్నం బోన్ నుండి 3వేళ్ళు పైన ఉన్న ఆర్ ఈ ఎన్ 17 శక్తి కేంద్రాన్ని ప్రేరేపించడం ద్వారా ఊపిరితిత్తుల రిపేరు చేసుకోవచ్చని అలాగే హార్ట్ ప్రాబ్లమ్స్ నుంచి బయటపడవచ్చు అని తెలిపారు.ఇంకా ముఖ్యమైన నాడీ కేంద్రాల ఉపయోగం గురించి తెలియజేసి వాడుకోవటానికి మోడీ హెల్త్ కేర్ స్టిక్ ని ఉచితంగా అందరికీ అందించడం జరిగింది. మదర్ తెరిసా ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ తమ హాస్పటల్ ప్రజలకి ఆరోగ్యం అందిచాలని అనే దృక్పథంతో ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహించినట్లు చెప్పారు. గిరిజ నర్సింగ్ కాలేజ్ గుడివాడ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం తమ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడిందని మా పిల్లలు వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ చికిత్స కార్యక్రమం కూడా అందించేలాగా ప్రోత్సహిస్తామని తెలిపారు.డాక్టర్ మాకాల సత్యనారాయణ నర్సింగ్ విద్యార్థులకు వారి సమస్యలని ఈ ప్రాణ శక్తి విధానం ద్వారా ఎలా తగ్గించుకోవాలో చూపించి నేర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులు స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు

ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నూతన డిస్పెన్సరీ

మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త : రాత్రనకా పగలనకా కష్టపడే ఆర్టీసీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉండి ఆదుకుంటుందని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో 80 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ఆర్టీసీ జిల్లా డిస్పెన్సరీ నూతన భవనాన్ని మంత్రి రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఎండి ద్వారకా తిరుమలరావులతో కలిసి ప్రారంభించారు. అనంతరం స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్టీసీ ప్రాంగణంలోనే ఏర్పాటుచేసిన పిల్లలకు పాలిచ్చే గదిని మంత్రివర్యులు ఆర్టీసీ చైర్మన్, ఎం డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీజీపీగా ఉత్తమ సేవలందించినందుకు గుర్తింపుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కష్టాల్లో ఉన్న ఆర్టీసీనీ గట్టెక్కించేందుకు ద్వారకా తిరుమలరావును ఆర్టీసీ ఎండీగా నియమించారన్నారు. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ డ్రైవర్లు అభినందనీయులని మంత్రి అన్నారు. ఈ డిస్పెన్సరీ వలన ఆర్టీసీ ఉద్యోగులు కార్మికులకు ఎంతో ప్రయోజనకరమని ముఖ్యంగా కంటిచూపు చాలా అవసరం అన్నారు. ఒక ఆర్టీసీ డ్రైవర్ గుండెల్లో నొప్పి వచ్చిన ప్రయాణికులను సురక్షితంగా పక్కకు తీసుకువెళ్లి బస్సులు నిలిపి ప్రాణం వదిలాడని అటువంటి డ్రైవర్లు ఉన్న ఆర్టీసీ ఎంతో గొప్పదని కొనియాడారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ ఆర్టీసీతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. కార్మిక సంస్థ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులుగా పనిచేశానన్నారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. జిల్లా డిస్పెన్సరీలో ఆర్టీసీ కార్మికులకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందుతున్నాయన్నారు. ఆర్టీసీ కార్మికులు డిస్పెన్సరీను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టిసి ఎండి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగి ఆరోగ్యం రికార్డు కంప్యూటర్‌లో నిక్షిప్తమై ఉంటుందని ఆర్టిసి పరిధిలో ఏ ప్రాంతానికి వెళ్లిన అక్కడ ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే అక్కడే ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు వీలుంటుందన్నారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపడుతున్నామని కోటి రూపాయల బీమా భారతీయ స్టేట్ బ్యాంకుతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఎంతోకాలంగా పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లకు పాత పద్ధతిలోని పదోన్నతులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా పోలీసు అధికారి ఆర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ డ్రైవర్లు వారి కుటుంబాలతో పాటు బస్సులోని 50 మంది కుటుంబాల ప్రాణాలు వారి చేతిలో ఉంటాయి ఎంతో జాగ్రత్తగా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, మచిలీపట్నం డీఎం పెద్దిరాజు, ఐసిడిఎస్ పిడి యమ్. ఎన్. వాణి, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, స్థానిక ప్రముఖులు బండి రామకృష్ణ, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, ఆర్ టి సి ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

చదువునేర్పే గురువులకు అవమానాలా..?

చిత్తూరులో ప్రైవేట్ టీచర్ పై తప్పుడు కేసును ఖండించిన మల్లాది విష్ణు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపులకు దిగుతోందని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. విద్యా సంవత్సరం ముగుస్తున్నా.. విద్యార్థులకు తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్ మెంట్ అందలేదని ప్రశ్నించిన చిత్తూరు కాణిపాకానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయుడు జ్యోతి కుమార్ పై తప్పుడు కేసులు బనాయించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తలెత్తుకు జీవించే గౌరవ స్థానంలో ఉండే ఉపాధ్యాయులు ఏపీలో ఈరోజు ప్రభుత్వ కక్ష సాధింపుకు గురవుతుండటం దురదృష్టకరమన్నారు. ఉత్తమ సమాజాన్ని నిర్మించేది ఉపాధ్యాయులు మాత్రమేనని.. అటువంటి ఉపాధ్యాయులను గౌరించుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. కానీ ఈ ప్రభుత్వం కక్ష సాధింపులతో.. విద్యాబుద్దులు నేర్పే ఉపాధ్యాయుడిపై నాటు సారా తరలించాడని తప్పుడు కేసు పెట్టడం ప్రభుత్వ దిగజారుడుతనానికి అద్దం పడుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాల్ని, లోపాల్ని ప్రశ్నించేవారిని, సామాజిక మాధ్యమాల్లో గళమెత్తేవారిపై ఈ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వ ఒత్తిళ్లు తాళలేక చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు గుండెపోటుతో మరణించారని.. మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థపై బాధ్యతగా, విద్యను అందించే గురువులపై గౌరవంగా వ్యవహరించాలని మల్లాది విష్ణు విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో కూటమి అవలంభిస్తున్న ఈ అప్రజాస్వామిక విధానాలకు గానూ ప్రజలు తగిన గుణపాఠం తప్పక నేర్పుతారని హెచ్చరించారు.

తెలంగాణ వార్తలు

ప్రజా ప్రయోజనాల విషయంలో ఖర్చుకు వెనుకాడవద్దు: రేవంత్ రెడ్డి

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రజా ప్రయోజనాల విషయంలో వ్యయానికి వెనుకాడవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చేపడుతున్న అనుసంధాన రహదారుల నిర్మాణం, విస్తరణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా లింక్ రోడ్లను నిర్మించాలని సూచించారు. హైదరాబాద్ మున్సిపల్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలోని 49 రోడ్ల నిర్మాణం, విస్తరణపై ఆయన పలు సూచనలు చేశారు. వివిధ ప్రాంతాల అనుసంధానం, ఆటంకాలు లేని రాకపోకలకు వీలుగా రహదారులు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అదనపు భూసేకరణ విషయంలో వ్యయానికి వెనుకాడవద్దని, ప్రజాప్రయోజనాలనే దృష్టిలో ఉం చుకోవాలని అన్నారు.

కొడంగల్ అభివృద్ధికి ఎవరూ హైదరాబాద్ రావాల్సిన అవసరం లేదు

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : కొడంగల్ అభివృద్ధి కోసం ఎవరూ హైదరాబాద్ రావాల్సిన అవసరం లేదని, ఒక లేఖ రాసిస్తే తానే స్వయంగా కొడంగల్‌కు వచ్చి పనులన్నీ పూర్తి చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఒక్క సంతకంతో కొడంగల్‌ను వెతుక్కుంటూ అన్నీ అక్కడికే వస్తాయని ఆయన హమీ ఇచ్చారు. కొడంగల్ ప్రజలు వెళ్లి ఎవరినో, ఏదో అడగాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఈరోజు తన కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గ కేంద్రంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనకు పాలించే శక్తిని ప్రసాదించింది కొడంగల్ ప్రజలే అని అన్నారు. కొందరికి అధికారం కోల్పోయినందుకు దుఃఖం ఉండవచ్చని, అలాంటి వారిని పట్టించుకోవద్దని వ్యాఖ్యానించారు. ముస్లిం సామాజిక వర్గానికి ఎక్కువ అవకాశాలు ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీయే అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి తన కొడంగల్ పర్యటనలో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు.

ఒవైసీ లాంటి వాళ్లు 100 మంది వచ్చినా ఆ బిల్లు ఆగదు: బండి సంజయ్

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : ఒవైసీ వంటి వారు వంద మంది వచ్చినా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆపలేరని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఒవైసీ తాత వచ్చినా ఈ బిల్లు ఆగదని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ముస్లిం సమాజం, మేధావులు వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు తెలుపుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఒక్క ఒవైసీ వస్తే బిల్లు ఆగుతుందా అని ఆయన ప్రశ్నించారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకువస్తామని చెప్పినప్పుడు తనకు కరీంనగర్‌లోని పేదవాడు గుర్తుకు వచ్చాడని ఆయన అన్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్సులోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం కేంద్ర సహాయ మంత్రి రూ. 15 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ, వక్ఫ్ బోర్డు బిల్లుపై మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. అతి త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందుతుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ బిల్లును మతపరమైన కోణంలో చూడటం సరికాదని బండి సంజయ్ అన్నారు. దేశం కోసం, ప్రజల కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోదని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు పేరుతో పేదలు ఎన్ని ఇబ్బందులు పడ్డారో తనకు తెలుసని అన్నారు. కరీంనగర్‌లో ఒక పేద వ్యక్తి ఇల్లు నిర్మించుకుంటే, అది వక్ఫ్ బోర్డు స్థలమని చెప్పి అధికారులు అనుమతులు రద్దు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వ్యక్తి తాత ముత్తాతలు కూడా అదే ఇంట్లో నివసించారని తెలిపారు. ఈ బిల్లుకు మతం రంగు పులిమి కొందరు కుహనా లౌకికవాదులు, ఒవైసీ అడ్డుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రజల కోసం తాను ఎన్నో పోరాటాలు చేశానని, ఆ సందర్భాలలో తాను జైలుకు వెళితే న్యాయవాదులు తనను బయటకు తీసుకువచ్చారని బండి సంజయ్ అన్నారు. కోర్టు ముందు చెట్లు తొలగించినందుకు, పాకిస్థాన్-భారత్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా పాకిస్థాన్ జెండాలు పట్టుకున్న వారిపై పోరాడిన సమయంలోనూ తాను జైలుకు వెళ్ళానని ఆయన గుర్తు చేశారు.

హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌తో భట్టి విక్రమార్క సమావేశం

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భద్రత పెంపునకు కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సఖుతో సిమ్లాలో సమావేశమైన ఆయన, విద్యుత్ ఒప్పందంపై చర్చించారు. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, తెలంగాణలో విద్యుత్ డిమాండ్ వేగంగా పెరుగుతోన్న నేపథ్యంలో 'తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025' ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్‌తో ఒప్పందం కుదుర్చుకోవడం గొప్ప ముందడుగని అన్నారు. హిమాచల్ ప్రదేశ్ భాగస్వామ్యంతో ఆర్థికంగా లాభదాయకమైన, స్వచ్ఛమైన విద్యుత్‌ను పొందేందుకు ఈ ఒప్పందం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. థర్మల్ విద్యుత్‌తో పోలిస్తే జల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుందని, థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు ఏటా పెరుగుతుండగా, జల విద్యుత్ ఉత్పత్తి వ్యయం క్రమంగా తగ్గుతోందని ఆయన తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లో జీవనదులు అధికంగా ఉం డటం వల్ల ఏడాదిలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, పర్యావరణ హితమైన విద్యుత్‌ను అందించేందుకు వీలు కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇఫ్తార్ విందును బహిష్కరించమని పిలుపునివ్వటం అవివేకం : ఫరూఖ్ షిబ్లీ

-సోదరభావం పెంచే పవిత్ర ఇఫ్తార్ కార్యక్రమాన్ని వక్ఫ్ బిల్లు అంశానికి జోడించటం సమంజసం కాదు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్రంలో ప్రజా సంఘాల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూఖ్ షిబ్లీ విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న నాకు టీడీపీ ప్రాథమిక సభ్యత్వం గానీ,ఎన్నికల తరువాత ఎటువంటి ప్రభుత్వ పదవులు గానీ లేవని, ఎన్నికల ముందు టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ ముస్లిం సమాజం యొక్క పూర్తి మద్దతు టీడీపీకే అని ఎంహెచ్ పిఎస్ & అనేక ప్రజా సంఘాలు తీర్మానించాయని.ముస్లింలు అత్యధికంగా ఉండే రాయలసీమ లాంటి నియోజకవర్గాల్లో సైతం టీడీపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందారని, దానికి కారణం కేవలం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర యువ నాయకులు నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం గతంలో వారు ముస్లిం సమాజాన్ని గుండెల్లో పెట్టుకొని చూసుకున్నారు,ఇప్పుడు సైతం అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని, గత వైసిపి ప్రభుత్వానికి ముస్లింలు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించినప్పటికీ సిఎఎ లాంటి అనేక నల్ల చట్టాలకు పార్లమెంటులో బీజేపీ ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ఇచ్చిన విషయం అందరికి తెలిసిందే. కానీ ఏ రోజు కూడా వైసిపికి వ్యతిరేకంగా ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నామని నిన్న మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ఏ ప్రజా సంఘం కూడా మాట్లాడలేదు.గతంలో ఆ పని ఎప్పుడూ చెయ్యలేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు మంత్రి నారా లోకేష్, న్యాయ & మైనారిటీ శాఖ మంత్రి పెద్దలు ఎన్ఎండి ఫరూఖ్ టీడీపీ ఎంపీలు ఈ చట్ట సవరణల్లో నుండి ముస్లింలకు అభ్యంతరాలు ఉన్న అంశాలను తొలగించటానికి శతవిధాలా కృషి చేస్తుంటే వారికి బాసటగా ఉండాల్సింది పోయి.. వారు ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నామని ప్రకటించటం దారుణమని అన్నారు. కానీ ఇవాళ ప్రభుత్వం ఒక మంచి సంకల్పంతో, మంచి ఉద్దేశంతో హిందూ ముస్లింల మధ్య సోదరభావం పెంపొందించే పుణ్యకార్యంలా భావించి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తుంటే.. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఈ ఇఫ్తార్ విందును బహిష్కరించమని పిలుపునివ్వటం అవివేకం అవుతుందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం తీసుకు రానున్న వక్ఫ్ సవరణల చట్టానికి మేము, మాతోపాటు అన్ని ముస్లిం మైనారిటీ ప్రజా సంఘాలు వ్యతిరేకమే. కానీ వక్ఫ్ ఆస్తులను కాపాడటానికి, అలాగే బీజేపీ తెస్తున్న నూతన వక్ఫ్ సవరణల చట్టం నుండి ముస్లింలకు అభ్యంతరం ఉన్న సవరణలను తొలగించటానికి చంద్రబాబు ప్రభుత్వం ఏమాత్రం వ్యతిరేకం కాదన్న సంగతి ప్రతి ఒక్కరూ గమనించాలని కోరారు. ఇందులో భాగంగానే జెపిసి నియామకం, ప్రతిపాదించిన కొన్ని సవరణలను ముస్లిం సమాజం అభ్యంతరాలను దృష్టిలో ఉంచుకొని, జెపిసి పై ఒత్తిడి తెచ్చి కొన్ని గణనీయ మార్పులు చేయించడం జరిగిందన్నారు వివిధ మతాల ప్రజల మధ్య సోదరభావం పెంచే పవిత్ర ఇఫ్తార్ కార్యక్రమాన్ని వక్ఫ్ బిల్లు అంశానికి జోడించటం సమంజసం కాదని షిబ్లీ హితవు పలికారు.

జైల్లో ఉండాల్సిన వ్యక్తి ఈరోజు ముఖ్యమంత్రిగా ఉన్నారు

తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : జైల్లో ఉండాల్సిన వ్యక్తి ఈరోజు ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా ఉన్నారని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి రాజ్యాంగ వ్యవస్థల న్నింటినీ ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన ముఖ్యమంత్రి వాటిని హరిస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలో రాక్షస, రాబందుల పాలన నడుస్తోందని అన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సభ లోపల, బయట గణాంకాలతో సహా రేవంత్ రెడ్డి తీరును ఎండగట్టి ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిలబడిందని అన్నారు. బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల గొంతుకగా పోరాడటాన్ని ముఖ్యమంత్రి జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిని రేవంత్ రెడ్డి లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆర్.ఎస్.పీ అన్నారు.మార్చి 15, 16 తేదీల్లోనే పదిహేను కేసులు పెట్టారని, రీట్వీట్ చేసిన వారిపై కూడా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అశ్లీలత మీద పెట్టాల్సిన సెక్షన్ 67 ఐటీ యాక్ట్ ని బీఆ

వరల్డ్ ఓరల్ హెల్త్ డే క్యాంపెయిన్‌కు ముందు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ నెలకొల్పిన సెన్సోడైన్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : బెంగుళూరు: ప్రముఖ నోటి సంరక్షణ బ్రాండ్ సెన్సోడైన్, ఆన్‌లైన్‌లో 24 గంటల్లో అత్యంత ఎక్కువ దంత పరీక్ష పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా గిన్నిస్ వరల్డ్ రికార్డును నెలకొల్పింది. మహా కుంభ్ 2025లో రికార్డు నెలకొల్పగా, ఈ ప్రయత్నంలో 27 వేల మందికి పైగా వ్యక్తులు దంత పరీక్షలు చేయించుకున్నారు. ఇది చురుకైన నోటి సంరక్షణ ప్రాముఖ్యత గురించి భారతీయులకు అవగాహన కల్పించడంలో ఒక ముఖ్యమైన అడుగును సూచిస్తుంది. తన నిబద్ధతను మరింత ముందుకు తోడ్కొని వెళ్లేందుకు సెన్సోడైన్ కొత్తగా విడుదల చేసిన రూ. 20 ధరకు లభించే చిన్న టూత్‌పేస్ట్ ప్యాక్‌ను కూడా వితరణ చేసింది. వరల్డ్ ఓరల్ హెల్త్ డే క్యాంపెయిన్‌కు ముందు సెన్సోడైన్ నెలకొల్పిన ఈ రికార్డు ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ ప్రచారానికి నాంది పలికిందని హోలియన్ ఇండియా సబ్ కాంటినెంట్ ఓరల్ హెల్త్ కేటగిరీ లీడ్ కిష్లే సేథ్ పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలి...

-నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ జలీల్ డిమాండ్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : వక్ఫ్ చట్ట సవరణలు అంటూ ముస్లింల జీవితాలతో చెలగాటమాడుతుందని దానిని వ్యతిరేకిస్తున్నట్లు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రానికి స్పష్టం చేయాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. గురువారం గాంధీ నగర్లోని ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ముస్లింల మతపరమైన అంశాల్లో జోక్యంగా భావిస్తున్నాం అన్నారు. వక్ఫ్ బోర్డు కమిటీని రద్దు చేయటంతో పాటు అధికారులను ప్రక్షాళన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సైదా, గుర్రం రామారావు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సాధికార సారథుల నియామక ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తిచేయాలి

- ఎమ్మెల్యే బొండా ఉమ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ సెంట్రల్ నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు గురువారం ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజక వర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కుటుంబ సాధికారక సారథులు (కెఎస్ఎస్) అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తెలుగుదేశం కుటుంబసభ్యులకు పార్టీ సభ్యత్వ కార్డే అసలు సిసలైన గుర్తింపు కార్డు అని, దాని ద్వారా లభించే గౌరవం ఎంతో విలువైనదని, అధికారంతో సంబంధం లేకుండా ఎప్పుడూ ప్రజల కోసం పనిచేయడం ఒక వరం అని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీ పూర్తి చేసాము అని, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సాధికార సారథుల జాబితాలో విధిగా నమోదై ఉండాలి అని సంక్షేమ పథకాలు అర్హులకే అందాలనేది కూటమి ప్రభుత్వ సదుద్దేశమని, కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని ఉగాది నుంచి ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు గారు పీ-4 పథకాన్ని ప్రారంభించి రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించి, ప్రతి ఒక్కరి ఆదాయం పెంచి, తద్వారా రాష్ట్ర తలసరి ఆదాయం పెంచాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, టీడీపీ సభ్యత్వాన్ని మించిన గుర్తింపుకార్డు మరోటి ఉండదని, తెలుగుదేశం కుటుంబ సభ్యులుగా మనల్ని గర్వపడేలా చేసేది సభ్యత్వం కార్డే అని అన్నారు. అదే విధంగా సెంట్రల్ నియోజకవర్గ మొత్తం మీద పదివేల 600 మంది కుటుంబ సాధికారక సారథులు (కెఎస్ఎస్) అవసరమని వారు ప్రతీ 30 మంది ఓటర్లకు ఒక గృహ సారథి ఉంటారని తెలియజేశారు స్థానిక నాయకత్వం నిరంతరం ప్రజల మధ్యన ఉండి ప్రజలకు సేవలందించాలి అని అన్నారు. ఇప్పటివరకు 140 కోట్లతో సెంట్రల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టం జరిగినది అని, అదేవిధంగా వీఎంసి కౌన్సిల్లో సెంట్రల్ నియోజకవర్గంలో పనుల నిమిత్తం ?40 కోట్లతో ఆమోదం జరిగింది అని, మే నెలలో జరిగే మహానాడు కార్యక్రమానికి కార్యకర్తలు అందరూ సిద్ధం కావాలని ఈలోగా డివిజన్ కొత్త కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఏప్రిల్ మొదటి వారం నుంచి ఈ పనులు మొదలు పెడతామని పార్టీ నాయకత్వానికి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సెంట్రల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవీనీత సాంబశివరావు, 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచనేని లలిత, ఘంటా కృష్ణమోహన్, ఎరబోతు రమణారావు, సింగం వెంకన్న,దాసరి కనకారావు, ఆలా తారక రామారావు మరియు డివిజన్ ఇన్చార్జులు అధ్యక్షులు సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

నీట్ 4.0తో ప్రెప్‌ఇన్‌స్టా భాగస్వామ్యం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రముఖ ప్లేస్‌మెంట్ సన్నాహక వేదిక ప్రెప్‌ఇన్‌స్టా ఇప్పుడు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్)4.0 నేషనల్ ఎడ్యుకేషనల్ అలయన్స్ ఫర్ టెక్నాలజీ కార్యక్రమంలో భాగమైందని సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారతీయ విద్యార్థులను పరిశ్రమకు కావాల్సిన నైపుణ్యాలు, పోటీతో కూడిన అంతర్జా తీయ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తుందన్నారు. దేశంలో సాంకేతిక విద్యను మార్చే ప్రెప్‌ఇన్‌స్టా కోర్సులు ఇప్పుడు నీట్ 4.0 పోర్టల్ ద్వారా పొందవచ్చ న్నారు. 2019లో స్థాపించిన ప్రెప్‌ఇన్‌స్టా జనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్‌వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాలలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడంపై దృష్టి పెడుతుందన్నారు. బిగ్ 4, ఫాంగ్ సహా అగ్రశ్రేణి ప్రపంచ కంపెనీలలో ప్లేస్‌మెంట్లు పొందడంలో విద్యార్థులకు ఈ కార్యక్రమాలు సాయపడతాయన్నారు. అంతే కాదు ప్రతి విద్యార్థి ప్లేస్ మెంట్ ప్రక్రియ పూర్తిగా ట్రాక్ చేసేందుకు, వారి పనితీరు పర్యవేక్షించడానికి, అనుకూలమైన అసెస్‌మెంట్స్ నిర్వహించడానికి ఎస్ఎఎఎస్ టూల్‌తో కాలేజీ మేనేజ్‌మెంట్‌కు ప్రెప్‌ఇన్‌స్టా సాయపడుతుంద న్నారు. ప్రెప్‌ఇన్‌స్టా సహ-వ్యవస్థాపకుడు మనీష్ అగర్‌వాల్ మాట్లాడుతూ, ఏఐసీటిఈ, నీట్ కార్య క్రమంతో భాగస్వామ్యం భారతదేశంలో సాంకేతిక విద్య భవిష్యత్‌ను మార్చే దిశగా ఒక అడుగు వేసిందిన్నారు. కెరీర్‌కు కావాల్సిన నైపుణ్యాలకు తగ్గట్టుగా విద్యార్థులను సిద్ధం చేసి వేగంగా ఎదుగుతున్న ఉద్యోగ మార్కెట్‌లో వారికి ఉద్యోగాలు వచ్చేలా చూడటం మా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తన నెట్ వర్క్‌ను 250o కాలేజీలకు విస్తరించాలన్నది ధ్యేయంగా పెట్టుకుందన్నారు. 2019లో విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన నీట్ కార్యక్రమం, విద్యా ర్థులు ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా అణిచివేతకు గురయ్యే నేపథ్యం కలిగిన వారికి సాంకేతిక విద్యా పరిష్కారాలు చూపి వారి ఉపాధి అవ కాశాలు పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారించిందన్నారు.

వై.యన్.ఆర్.చారిటీ ద్వారా తోపుడు బండ్లు వితరణ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ నగరంలో స్వర్గీయ దేవినేని నెహ్రూ చారిటిబుల్ ట్రస్ట్ మరియు వై.యన్.ఆర్. చారిటీస్ ద్వారా ఎందరో నిరుపేదలకు జీవనో పాధి కల్పించడం తో పాటు ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఎన్టీఆర్ జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు,తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దేవినేని అవినాష్ పేర్కొన్నారు. గురువారం వై.యన్.ఆర్.చారిటీ చైర్మన్ యలమంచిలి జయ ప్రకాష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని 5వ డివిజన్ సున్నంబట్టీల సెంటర్ నందు నిరుపేద కుటుంబాలకి చెందిన మేరీ రాణి,దివ్య జీవనోపాధి నిమిత్తం రూ.30,000/- విలువ చేసే రెండు తోపుడు బండ్లను ఎన్టీఆర్.జిల్లా వైసీపీ అధ్యక్షులు,తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ దేవినేని అవినాష్ వారికి ఉచితంగా అందజేశారు.ఈ సందర్భంలో అవినాష్ మాట్లాడుతూ దేవినేని నెహ్రూ సేవా స్ఫూర్తితో జయ ప్రకష్ వారి చారిటీ సంస్థ ద్వారా ఎన్నో వేల మందికి ఉపాధి, విద్య రంగాలలో అండగా నిలుస్తున్నారు అని అన్నారు.దాదాపు 15 ఏళ్ళ నుండి వారి తండ్రి పేరు మిద సామజిక సేవలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో చిత్రం లోకేష్,నీలం కొండ,సాయి కోటి తదితరులు పాల్గొన్నారు.

మెట్రో భూ సేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

-జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ మెట్రో భూ సేకరణ ప్రక్రియ పై ప్రత్యేకంగా దృష్టిసారిస్తున్నామని, ఏపీ మెట్రోరైలు కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎంఆర్‌సీఎల్) అందించిన ప్రతిపాదనల ప్రకారం ఉమ్మడి తనిఖీలకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం జరిగిన మెట్రోరైలు కార్పొరేషన్ బోర్డు సమావేశానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కలెక్టర్ కార్యాలయం నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. సమావేశంలో మెట్రో రైలు ప్రాజెక్టు భూ సేకరణ సంబంధిత అంశాలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఫేజ్-1 విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు భూ సేకరణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. ఫేజ్-1 కారిడార్ 1ఏ (గన్నవరం-పీఎన్‌బీఎస్), కారిడార్ 1బీ (పీఎన్‌బీఎస్-పెనమలూరు) భూ సేకరణ ప్రక్రియలో భాగంగా వివిధ శాఖల అధికారుల ఉమ్మడి తనిఖీలు, నిధుల అంచనాలతో నివేదిక రూపకల్పన, సామాజిక ప్రభావ అంచనా (ఎస్ఐఏ) అధ్యయనం తదితరాలకు చొరవ చూపడం జరుగుతోందన్నారు. ఎన్‌టీఆర్ జిల్లా వరకు చూస్తే విజయవాడ సెంట్రల్, విజయవాడ ఉత్తర, విజయవాడ తూర్పు, విజయవాడ గ్రామీణ మండలాల పరిధిలో దాదాపు 10 ఎకరాల సేకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

నేటి యువ శిల్ప కళాకారులకు ఆదర్శం దేవు దీక్షితులు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : శిలలపై శిల్పాలు చెక్కినాడు...సహజత్వం ఉట్టిపడేలా శిల్పాలను రూపొందించడంలో సుప్రసిద్ధ శిల్ప కళాకారుడు దేవు దీక్షితులు (శిల్పి) అందవేసిన చేయి. వంశపారంపర్యంగా వస్తున్న శిల్పాల తయారీ విద్య దానికి తోడు ఆయన ఆసక్తితో నేటి తరానికి శిల్ప తయారీకి నిదర్శనంగా నిలిచాడు. మట్టితో శిల్పాలను తయారు చేసి తద్వారా అచ్చులను తయారు చేసుకుని కంచు, రాగి తదితర మూర్తులను రూపొందించడం ఆయనకు వెన్నతోపెట్టి విద్య. ఆ విద్యతోపాటు తదితర విషయాలను "నేటి పత్రిక ప్రజావార్త" కు వివరించారు. దేవాలయాలకు పంచలోహ విగ్రహాలు, దేవుడి పూజకు అవసరమయ్యే వస్తు సామాగ్రి, దేవుని ఊరేగింపుకు ఉపయోగించే వాహనాలు, మకర తోరణాలు, గంటలు, కవచాలు, కంచుపాత్రలు, పంచలోహ విగ్రహాలు తదితరాలు తయారు చేస్తామని తెలిపారు. దేశ నాయకుల విగ్రహాలు, ప్రముఖుల విగ్రహాలు కంచుతో తయారుచేసి అందజేస్తామన్నారు. క్లేవర్క్, వాక్స్, కంచుతో వివిధ స్టెప్స్‌లో విగ్రహాలు తయారు చేస్తామన్నారు. దీనిలో 50 సంవత్సరాలు అనుభవం వుందన్నారు. ఇది తనకు వంశపారంపర్యంగా నాకు ఈ నైపుణ్యం వచ్చిందన్నారు. డిగ్రీ చదివి, ఫైన్ ఆర్ట్స్ డిప్లొమా ఇన్ ఫైన్ ఆర్ట్స్ చేశానని తెలిపారు. ఒంగోలు, గుంటూరు వివిధ ప్రాంతాలలో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో ఆర్టిస్టుగా పనిచేసి రిటైర్డ్ అయినట్లు తెలిపారు. వీటితోపాటు సిమెంట్‌తో చేసిన విగ్రహాలు తయారీ, ఇలస్ట్రేషన్ వర్క్ మరియు పెయింటింగ్‌తో చిత్రాలు చిత్రీకరిస్తానన్నారు. కొద్దికొద్దిగా కనుమరుగవుతూ కొంత వరకు పరిమితం అవుతున్న శిల్ప కళాతయారీ విద్యను భావి తరాల వారికి తెలియజేయాలనేదే తన తాపత్రయమన్నారు. ఎంతోమంది గొప్పగొప్ప వ్యక్తుల ప్రశంసలు, మరెన్నో అవార్డులు సాధించినా భావితరాలకు ఏదో చేయాలనే తపనతోపాటు తన కళ చిరస్మరణీయంగా నిలవాలన్నదే తన ఉద్దేశ్యమన్నారు. తాను తయారు చేసిన విగ్రహాలు ఇప్పటికీ కాలేజీల నుండి కళాక్షేత్రాలు తదితర కూడలి ప్రాంతాలలో వివిధ సైజులలో విగ్రహాలు మనం చూడవచ్చని తెలిపారు. అలాగే పూర్వీకుల జ్ఞాపకార్థం కూడా విదేశాల నుండి కూడా ఇక్కడకు వచ్చి తన చేత విగ్రహాలు చేయించుకుని వెళతారని తెలిపారు. ఎన్‌టిఆర్, సినీ డైరెక్టర్ జంధ్యాల, పట్టాభి సీతారామయ్య, మదర్ థెరిసా, ఆచార్య ఎన్‌జిరంగా, ఇందిరా గాంధీ విగ్రహం, శ్రీకృష్ణ దేవ రాయలు విగ్రహం, దేశ భక్తులు, అలెగ్జాండర్ గ్రాహంబెల్, శాస్త్రజ్ఞులు, తదితర విగ్రహాలు రెండు జంట తెలుగు రాష్ట్రాలలో దేవాలయాలలో మనం చూడవచ్చు. ఇప్పటికైనా ఇప్పటి ప్రభుత్వాలు కనుమరుగవుతున్న పురాతనమైన విగ్రహాల తయారీ కళను ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి కళాకారులను గుర్తించి ప్రభుత్వాలు తగిన విధంగా పురస్కారాలు అందజేయాలని ఆశిద్దాం...అవి ప్రోత్సాహకాలుగా యువతకు ఆదర్శంగా నిలుస్తాయి.

న్యాయవాది పిల్ల శ్రీనివాసరావుకి సత్కారం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : 2025-2026కు జరిగిన బెజవాడ బార్ అసోసియేషన్ బార్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన వైస్ ప్రెసిడెంట్ పిల్ల శ్రీనివాసరావుని మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్లో తలపర గడ సుబ్బారావు ఏ.పి.పి, బూసి సతీష్‌బాబు ఏక్స్.జి.పి, పలగాని రవి ఏక్స్.ఎల్.సి, అల్లం రాజేష్ ఉమ్మడి కృష్ణాజిల్లా కాపు సెల్ చైర్మన్, న్యాయ వాదులు తదితరులు అభినందనలు తెలిపి సత్కరించారు.

హజరత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ (ర.అలై) ఆవులియా వారి 437వ గంధం మహోత్సవాలు

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : భవానిపురంలోని హజరత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ (ర.అలై) ఆవులియా వారి 437వ గంధం మహోత్సవాలు ముజావర్స్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గురువారం తీన్మార్, ప్రత్యేక వాయిద్య బృందాలతో అంగరంగ వైభవంగా కన్నుల పండుగగా ప్రత్యేక అలంకరణలతో, సర్వ మతల ఐక్యత చాటుతూ తరలివచ్చిన అతిథుల నడుమ భవానిపురం హజరత్ సయ్యద్ గాలిబ్ షాహిద్ దర్గా నుండి ఊరేగింపు బయలుదేరి పున్నమి హోటల్ వద్ద మలుపు తీసుకుని తిరిగి ఉదయం వరకు భవానిపురం పురవీధులలో వేలాదిగా తరలివచ్చిన భక్తుల నడుమ తిరిగి దర్గాకు చేరుకోవడం జరిగింది. ముందు దీపారాధన అనంతరం వేలాది మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దర్గా ప్రెసిడెంట్ ముష్తాక్ అహ్మద్ మీడియాతో మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా ఈ ఉరుసు మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఈ మహోత్సవంలో అన్ని కులాలు, మతాలవారు అన్ని పార్టీలకు సంబంధించిన రాజకీయ నాయకులు పాల్గొని విజయవంతం చేశారని ఈ ఉరుసు మహోత్సవ ఊరేగింపు కార్యక్రమంలో బందోబస్తు నిర్వహించిన పోలీసు వారికి మాకు సహాయ సహకారాలు అందించిన కార్పొరేషన్ వారికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్స్, కార్యనిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ప్రహరీ గోడ నిర్మాణం

-ఆర్.టి.ఒ. కార్యాలయ గోడపై గద్దె రామమోహన్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడలోని ఆర్.టి.ఒ. కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణాన్ని త్వరలో చేపట్టేందుకు చర్యలు తీసు కుంటున్నట్లు విజయవాడ తూర్పు శాసనభ్యులు గద్దె రామమోహన్ వెల్లడించారు. గురువారం నాడు గద్దె రామమోహన్ ఈ విషయంపై రాష్ట్ర సెక్రటేరియట్ నందు అధికారులతో సమావేశమయ్యారు. సమావేశ అనంతరం శాసనభ్యులు మాట్లడుతూ ఆర్.టి.ఒ. కార్యాలయానికి దక్షిణాన, బందరు కాల్వ వైపున ఉన్న ప్రహరీగోడ దక్షిణం వైపునకు వాలిపోయి ఉన్నదని, అక్కడ నివాసముంటున్న గృహాల వారు అది ఎప్పుడు తమ ఇళ్ల పై పడిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేయడంతో తానే స్వయంగా వెళ్లి అధికారులతో కలిసి పరిస్థితిని చూసిన తర్వాత గోడను కొత్తగా నిర్మించడానికి అంచనాలను తయారుచేయించానని వివరించారు. ఆర్. అండ్ బి. వారు రూ.15 లక్షలు అవసరమవుతుందని అంచనాలు రూపొందించారని తెలిపారు. సదరు అంచనా నివేదికతో సంబంధిత శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేను కలిసి అక్కడ పరిస్థితిని వివరించడం జరిగిందని చెప్పారు. ప్రహరీ గోడ దగ్గరలో ఉన్న గృహాల వారి భయాందోళనలను అధికారికి విన్నవించి అక్కడ గోడ నిర్మాణం వీలైనంత తొందరలో చేపట్టాలని కోరడం జరిగిందన్నారు. అధికారులు కూడ పరిస్థితిని అర్థం చేసుకొని, సానుకూలంగా స్పందించారని గద్దె రామమోహన్ చెప్పారు. త్వరలోనే ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నారని శాసనసభ్యులు తెలిపారు.

50% వడ్డీ మాఫీకి కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు

-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లింపులపై 50 % వడ్డీ మాఫీ కి కేవలం నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర. పన్ను బకాయల వడ్డీ పై 50% రాయితీ పొందేందుకు మార్చ్ 31, 2025 చివరి తేదీ అని గురువారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో కమిషన్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో గల 13 క్యాష్ కౌంటర్లు అన్నియును ఉదయం 8 గం నుండి సా. 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని, నగర పరిధిలోని 286 సచివాలయాల్లోనూ, ప్రతి సచివాలయంలో పన్ను చెల్లింపులకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కావున ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంటి పన్ను ఖాళీ స్థలాల పన్ను బకాయిలు ఉన్నవాళ్లందరూ వడ్డీ పై 50% రాయితీని పొందవచ్చు అని తెలిపారు.

హీటెక్కిన ఆంధ్రప్రదేశ్..

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : 150కి పైగా మండలాల్లో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు. మచిలీపట్నంలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత... విజయవాడ: వడగాలుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఠారెత్తాయి. కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో సగటున 40 డిగ్రీలకు చేరాయి. సాధారణం కంటే 4 డిగ్రీల వరకూ ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నట్టు ఐఎండీ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 150కి పైగా మండలాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ప్రకాశం జిల్లా కొమరోలు, నంద్యాల, కమలాపురంలో అత్యధికంగా 42.5 డిగ్రీల మేర ఉష్ణోగ్రత. ఎస్ కోట, అనకాపల్లి, అన్నమయ్య జిల్లా రుద్రవరంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు.కర్నూలు జిల్లా కొసిగి, శ్రీకాకుళం జిల్లా మిళియాపుట్టు, సత్యసాయి జిల్లా తాడిమర్రి, సబ్బవరం, వీరఘట్టంలో 41 డిగ్రీలు. అనంతపురం జిల్లా గుంతకల్లు, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, తిరుపతి, నెల్లూరులో 40 డిగ్రీలు. చిత్తూరు, కృష్ణా జిల్లా మచిలీపట్నం, పల్నాడు జిల్లా నరసరావుపేట, ఏలూరు తదితర ప్రాంతాల్లో 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు.

బెంజిసర్కిల్‌లో చలివేంద్రం ప్రారంభం

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ తరుణ్ కాకాని బెంజిసర్కిల్‌లో చలివేంద్రం ఏర్పాటుచేశారు. శుక్రవారం బెంజిసర్కిల్‌లోని ఉమ్మడి ఏపీ మాజీ కేబినెట్ మంత్రి మరియు జై ఆంధ్ర ఉద్యమ వ్యవస్థాపకుడు దివంగత నేత కాకాని వెంకటరత్నం విగ్రహానికి పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తర్వాత కెఏఎస్ఎస్ కాకాని ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు డాక్టర్ తరుణ్ కాకాని, బిజెపి నాయకులు ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కాకాని యొక్క మంచి పనులను గుర్తు చేసుకున్నారు. అలాగే డాక్టర్ తరుణ్ కాకానిని అభినందించారు. కాకాని ఆశయ సాధన సమితి అధ్యక్షుడు, అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని మాట్లాడుతూ కాకాని ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం కాలినడక ప్రయాణికులకు, వాహనదారులకు చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. ఎండలో సేదతీర్చిన ఫౌండేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు శ్రీరామ్ అడ్డూరి ప్రారంభించారు.ట్రాఫిక్ సీఐ రవికుమార్, రాజు, బీజేపీ నాయకులు రమేష్ మాదాల, అవ్వారు బుల్లబ్బాయి, పైలా సురేష్ బాబు, జాస్తి సతీష్, విజయవాడ తూర్పు బీజేపీ మండల అధ్యక్షులు పవన్ కుమార్, సందీప్ యర్రి, కేఏఎస్ఎస్ సభ్యులు గుమ్మడి రామకృష్ణ, గోగినేని ధనశేఖర్ .తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలి...

మచిలీపట్నం, నేటి పత్రిక ప్రజావార్త : వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలు కానున్న పాఠశాలల పునర్వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులతో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చే విద్యా సంవత్సరం నుండి అమలు కానున్న పాఠశాలల పునః వ్యవస్థీకరణ కార్యక్రమాన్ని సజావుగా చేపట్టాలన్నారు. 1, 2 తరగతులకు ఫౌండేషన్ పాఠశాలగా, 1 నుండి 5 వ తరగతి వరకు తక్కువ మంది విద్యార్థులు ఉంటే బేసిక్ ప్రాథమిక పాఠశాలగా, 1 నుండి 5 వ తరగతి వరకు ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే మోడల్ ప్రాథమిక పాఠశాలగా, 1 నుండి 8వ తరగతి వరకు ప్రాథమికోన్నత పాఠశాలగా, 6 నుండి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాల గా పునర్వ్యవస్థీకరణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులను, విద్యార్థుల తల్లిదండ్రులను, పాఠశాల కమిటీ సభ్యులను, స్థానిక నాయకులను భాగస్వాములు చేసి వారి అంగీకారంతో కార్యక్రమం సజావుగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ఎక్కడ కూడా మూసివేయరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వేసవి దృష్ట్యా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యాశాఖ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి రామారావు, పలువురు డిప్యూటీ ఈవోలు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు

టిఫిన్, భో